## కొత్తగూడెం కార్పోరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలి



- ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు
- అభ్యర్థులకు బి ఫారాలు అందజేత

2లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 04 | ఫిబ్రవరి | 2026 పేజీలు : 8

# గూడెం బరిలో కంకి కొడవలి..!



**-ఏదులాపురంలో ఒంటరి పోరుకు సై అన్న సిపిఐ**
**-వైరా, మధిర, ఇల్లందులో బిఆర్‌ఎస్‌తో అవగాహన**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కొత్తగూడెం కార్పోరేషన్ బరిలో సిపిఐ నిలిచింది. టిడిపితో అవగాహనతో 60 స్థానాల్లోనూ పోటీకి సై అన్నది. సిపిఐని తగ్గించాలని ప్రయత్నం చేస్తున్న శక్తులకు సరైన రీతిలో సమాధానం ఇచ్చేందుకు సిపిఐ క్యాడర్ సిద్ధమవుతుంది. గత పంచాయతీ ఎన్నికల్లోనూ నియోజక వర్గాన్ని హస్తగతం చేసుకోవాలని ప్రయత్నించిన వారికి ఇచ్చిన సమాధానం తీరుగానే కార్పోరేషన్ ఎన్నికల్లోనూ కమ్యూనిస్టు పార్టీ బరి గీసి నిలబడింది. 60 డివిజన్లలో మిత్రపక్షమైన టిడిపితో కలిపి తన అభ్యర్థులను రంగంలోకి దింపింది. నూతనంగా ఏర్పాటైన ఏదులాపురం పంచాయతీలోనూ ఒంటరి పోరుకే సిపిఐ సై అంది. కాంగ్రెస్‌తో అవగాహన కుదరకపోవడం, ఇతర పక్షాలతో జట్టు కట్టేందుకు సిపిఐ అంగీకరించక ఒంటరిగా బరిలో నిలిచింది. బలమైన అభ్యర్థులను రంగంలోకి దించి గెలుపుకు మార్గం సుగమం చేసుకుంటుంది. మధిర, వైరా, ఇల్లందులో బిఆర్‌ఎస్‌తో అవగాహన కుదుర్చుకోగా అశ్వారావుపేట, సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ ఒంటరిగా పోటీ చేస్తుంది. కొత్తగూడెం నియోజక వర్గంలో గత పంచాయతీ ఎన్నికల్లోనూ సిపిఐ ఒంటరిగానే పోరాడింది. నియోజక వర్గంలోని మేజర్ గ్రామ పంచాయతీలను తన ఖాతాలో వేసుకోవడంతో పాటు కాంగ్రెస్ కంటే ఎక్కువ ఓట్లను సాధించి అతిపెద్ద పార్టీగా నిరూపించుకుంది. అదే పంథాను కార్పోరేషన్ ఎన్నికల్లోనూ సిపిఐ అవలంభించనుంది. స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా కొత్తగూడెం నియోజక వర్గ సిపిఐ బాధ్యులు వ్యూహాత్మకంగా అభ్యర్థులను రంగంలోకి దించింది. నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల కోసం పోరాడుతున్న వారిని సిపిఐ పక్షాన బరిలో దించారు. నియోజక వర్గంలో రాజకీయ శక్తిగా నిలబడిన టిడిపి సిపిఐతో జత కట్టింది. పలు వార్డుల్లో ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేయగలిగిన శక్తి కొత్తగూడెం కార్పోరేషన్‌లో టిడిపికి ఉంది. మొత్తంగా సిపిఐ ఒంటరి పోరు ఇప్పుడు రాష్ట్రంలోనే చర్చనీయాంశమైంది. పంచాయతీ ఎన్నికల మాదిరి ఘన విజయాన్ని అందుకునేందుకు సిపిఐ శక్తులు

మిగతా 2లో..

## కంకి కొడవలితో సైకిల్ దోస్తీ..!




**- కార్పోరేషన్‌పై కామ్రేడ్స్ గురి**
**- దిశానిర్ధేశం చేస్తున్న ఎంఎల్‌ఏ కూనంనేని**
**- టిడిపి, ప్రజా సంఘాల మద్దతుతో ముందుకు...**

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ పాత మిత్ర బంధాన్ని కొనసాగిస్తూ సైకిల్‌తో దోస్తీ కట్టింది. అనుహ్య పరిణామాల నేపథ్యంలో కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో తెలుగుదేశం పార్టీతో పాటు ప్రజా సంఘాల మద్దతుతో ముందుకు సాగుతోంది. మొత్తం 60 డివిజన్లకు గానూ 57 డివిజన్లలో సిపిఐ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. 05,37,42 డివిజన్లకు గానూ టిడిపి అభ్యర్థులు అవగాహన గుర్తుచుకుని సిపిఐ మద్దతుతో కంకికొడవలి గుర్తుతోనే పోటీలు ఉండనున్నారు. సిపిఐకి కాంగ్రెస్‌తో దోస్తీ ఉంటుందనుకున్నప్పటికీ స్థానిక పరిస్థితులు రాజకీయ పరిణామాల నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఒంటరి పోరుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి నామినేషన్లు వేసి నాటి నుండి రసవత్తరంగా రాజకీయం మారడంతో మంగళవారం సిపిఐ,టిడిపి అభ్యర్థులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా బి ఫారాలను అందజేశారు. దీంతో ఆయా డివిజన్లలో అభ్యర్థులు ప్రచారాలు ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ రెండు డివిజన్లలో సిపిఎంతో పొత్తు పెట్టుగా, 58 డివిజన్లలో పోటీలో ఉంది. బిఆర్‌ఎస్ 59, బిజేపి 56 డివిజన్లలో ఒంటరిగానే పోటీ

మిగతా 2లో..

## ముగిసిన తొలి అంకం..!





**-ఒక చోట మినహా అన్నింటా పోటా పోటీ**
**-తెల్దారుపల్లి ఏకగ్రీవంపై సర్వత్రా చర్చ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి తొలి అంకం ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఏడు మున్సిపాలిటీలు కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో ఒకే ఒక స్థానం ఏకగ్రీవమైంది. ఏదులాపురం మున్సిపాలిటీలోని 15వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థి తమ్మినేని మంగతాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన మున్సిపాలిటీలన్నింటిలో బహుముఖ పోటీలు జరుగుతున్నాయి. కల్లూరు మున్సిపల్ ఎన్నికల బరిలో 20 వార్డులకు గాను 72 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు అన్ని స్థానాల్లో పోటీలో ఉండగా బిఎస్‌పి, బిజెపి, జనసేన పోటీలో ఉన్నాయి. అశ్వారావుపేటలో 78 మంది అభ్యర్థులు 22 వార్డుల నుంచి రంగంలో ఉన్నారు. ఏదులాపురం మున్సిపల్ బరిలో 32 వార్డులకు గాను 108 మంది అభ్యర్థులు

మిగతా 2లో..

# గూడెం బరిలో కంకి కొడవలి..!

(మొదటిపేజీ తరువాయి)
రాత్రింభవళ్ల శ్రమిస్తున్నాయి.

**బలమైన అభ్యర్థులతో బరిలోకి...**
కొత్తగా ఏర్పాటైన ఏదులాపురం మున్సిపాలిటీలో సిపిఐకి బలమైన వార్డులు ఉన్నాయి. ఏదులాపురం మున్సిపాలిటీగా ఏర్పడక ముందు అనేక దశాబ్దాలుగా పంచాయతీ ఎన్నికల్లో వరుస విజయాలు సాధిం చిన సిపిఐ మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు బలమైన అభ్యర్థు లను రంగంలోకి దించింది. యువతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ఉన్నత విద్యా వంతులైన సునావత్ పాండురంగ, దండి శ్రీజ, డాక్టర్ చెరుకుపల్లి పవిత్ర, మిడికంటి అరుణశ్రీ తో పాటు యువకులైన అఖిల భారత యువజన సమాఖ్య బాధ్యులు శ్రీనాథ్‌రెడ్డి లాంటి వారిని పార్టీ రంగంలోకి దించింది. నిరంతరం ప్రజల మధ్య ఉండే అభ్యర్థులను దండి రంగారావు, సత్తి శ్రీలక్ష్మి, చెరుకుపల్లి రజని, గూడె వీరభద్రం, రెంటాల శ్రీరాములను రంగంలోకి దించారు. ఇక్కడ బలమైన క్యాడర్ ఉండటం, పార్టీకి సంస్థాగతంగా బలముండటం సిపిఐకి గెలుపు అవకా శాలను సులభం చేస్తుంది. అశ్వారావుపేటలో 19వ వార్డు నుంచి సిపిఐ అభ్యర్థిని బరిలో దించారు. సత్తుపల్లిలో రెండు, ఇల్లందులో బిఆర్ఎస్‌తో అవగాహన కుదిరింది. ఇక్కడ సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ బిఆర్ఎస్‌తో జత కట్టాయి. బిఆర్ఎస్‌తో సిపిఐ అవగాహన కుదుర్చు కుని రెండు స్థానాల్లో పోటీ చేస్తుంది. వైరా మున్సిపల్ ఎన్నికల్లో 15వ వార్డు నుంచి సిపిఐ అభ్యర్థిని నల్లమోతు శైలజను బరిలోకి దించగా ఇక్కడ బిఆర్ఎస్, సిపిఎం పార్టీలు మద్దతునిచ్చాయి.

**చిందరవందరగా పొత్తులు...**
మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పొత్తులు చిందరవంద రగా ఉన్నాయి. ఒక పార్టీ మరో పార్టీతో అవగాహన కుదుర్చుకోవ డంలో పూర్తి స్థాయిలో వైఫల్యం చెందాయి. సిపిఎం ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్‌తో పూర్తి స్థాయిలో అవగాహన కుదుర్చుకోగా భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో కొత్తగూడెం, అశ్వారావుపేటలో కాంగ్రెస్‌తోనూ, ఇల్లం దులో బిఆర్ఎస్‌తోనూ సిపిఎం అవగాహన కుదుర్చుకుంది. సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం కార్పోరేషన్‌లో టిడిపితో అవగాహన కుదుర్చుకోగా అశ్వారావుపేటలో ఒంటరిగానే బరిలోకి దిగింది. ఇల్లందు, ఖమ్మం జిల్లాలోని వైరా, మధిర మున్సిపాలిటీలలో బిఆర్ఎస్‌తో అవగాహన కుదుర్చుకుంది. ఏదులాపురంలో ఒంటరిగానే బరిలోకి దిగింది. సత్తుపల్లిలోనూ సిపిఐ ఒంటరిగానే పోటీ చేస్తుంది. బిఆర్ఎస్ కొన్ని చోట్ల ఒంటరిగా మరికొన్ని చోట్ల కమ్యూనిస్టులను కలు పుకుని బరిలోకి దిగింది. కాంగ్రెస్ సైతం కొన్ని చోట్ల పొత్తులు కుదుర్చు కుని మరికొన్ని చోట్ల ఒంటరిగా పోటీ చేస్తుంది.

# ముగిసిన తొలి అంకం..!

(మొదటిపేజీ తరువాయి)
రంగంలో ఉన్నారు. కొత్తగూడెం కార్పోరేషన్‌లోని 60 డివిజన్లకు పోటీ జరుగుతుంది. మధిరలో టిడిపి అభ్యర్థులు కుర్చీ గుర్తుపై మూడు స్థానాల నుంచి పోటీ చేస్తుండగా ఒక స్థానంలో టిడిపి రెబల్ బరిలో ఉన్నారు. అనుకున్న స్థాయిలో రెబల్స్ లేకుండా ఒప్పించడంలో ప్రధా నంగా కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు సఫలీకృతమయ్యాయి. అన్ని పార్టీలు బీ ఫామ్‌లు అందజేసి తమ అభ్యర్థులను రంగంలోకి దించాయి.

**ఏకగ్రీవంపై సర్వత్రా చర్చ...**
ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఏకగ్రీవమైన ఏదులాపురం పరిధిలోని 15వ వార్డు ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో చర్చ నీయాంశంగా మారింది. ఈ వార్డు సిపిఎంకు కంచుకోటగా చెప్పుకునే తెల్దారుపల్లి గ్రామం కావడం ఖమ్మంజిల్లాకు చెందిన సిపిఎం అగ్రనేత తమ్మినేని వీరభద్రం స్వగ్రామం కావడమే ఈ చర్చకు కారణం. అంతేకాకుండా ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన నాయకుడు హత్యకు గురికావడం ఆ కేసులో సిపిఎం నాయకులపైనే కేసులు నమోదు కావడం ఇప్పుడు హత్యకు గురికాబడిన వ్యక్తికి సిపిఎం ఏకగ్రీవంగా కౌన్సిలర్ పదవిని కట్టబెట్టడం కూడా చర్చకు అవకాశమిచ్చింది. తమ్మినేని కృష్ణయ్య సిపిఎం చేతిలో హత్యకు గురికాబడ్డారు. ఈ కేసు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత తెల్దారుపల్లిలోని రెండు వార్డులకు కృష్ణయ్య కుమారుడు నవీన్, కృష్ణయ్య సతీమణి మంగతాయి నామినేషన్ వేయ గా సిపిఎం, బిఆర్ఎస్ పొత్తులో భాగంగా సిపిఎం అదే వార్డు నుంచి తన అభ్యర్థులను రంగంలోకి దింపింది. 15వ వార్డు నుంచి తమ్మినేని వీరభద్రం సోదరుడు కోటేశ్వరరావు సతీమణి విజయలక్ష్మి తో నామినే షన్ వేయించారు. ఏమి జరిగిందో కానీ నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజైనా మంగళవారం విజయలక్ష్మి నామినేషన్‌ను ఉపసంహరిం చుకున్నారు. సిపిఎంకు పట్టు ఉన్న గ్రామం కావడం, పలు మార్లు ఏక గ్రీవంగా ప్రజా ప్రతినిధులను ఎన్నుకున్న ఈ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి ఏకగ్రీవం కావడం వెనక రాజకీయ పరిణామాలు చోటుచేసుకు న్నట్లు సమాచారం. సిపిఎం మండల కమిటీ ఈ ఏకగ్రీవంపై స్పందిస్తూ తమ్మినేని కోటేశ్వరరావు సొంత నిర్ణయం తప్ప పార్టీ నిర్ణయం కాదని ప్రకటన చేయడంతో పాటు ఇందుకు కారకులైన వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపింది. కానీ ఇరు పార్టీల మధ్య ఉన్నత స్థాయిలోనే సంప్రదింపులు జరిగాయని సంప్రదింపుల అనంతరం రెండు స్థానా లను ఏకగ్రీవం చేసుకునేందుకు ప్రయత్నించారని వినికిడి. మొత్తంగా సిపిఎం కోటలో కాంగ్రెస్ ఏకగ్రీవం కావడం ఇప్పుడు రాజకీయ చర్చగా మారింది.

# ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం పెరిగేలా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అమలు


**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**





ప్రజాపక్షం/వైరా: పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం మెరుగుపరిచి, రీడింగ్ స్కిల్స్ పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. వైరా మండలం పాలడుగు గ్రామంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను తిరుగుతూ విద్యా బోధనను పరిశీలించారు. మూడు, నాలుగు తరగతి గదుల్లో విద్యార్థుల ను ప్రత్యేకంగా అందిం చిన రైమ్స్ ఎలా ఉన్నాయి అని అడిగారు. బోర్డుపై ఇంగ్లీష్ అక్షరాలు, పదాలు, పద్యాలు వ్రాసి వాటి యొక్క ఉచ్చారణ, అర్థం చేసుకుంటూ తిరిగి చెప్పగలుగుతున్నారా, ధ్వనులను బట్టి ఇంగ్లీష్ పదాలను గుర్తిస్తు న్నారా అని అడిగి విద్యార్థుల సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని కిచెన్‌లో వండిన అన్నం, కూరలను కలెక్టర్ పరిశీలించారు. భోజనంలో నాణ్యతను తప్పనిసరిగా పాటించా లని, విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. పాఠశాల పిల్లలతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం మంచిగా ఉం టుందా, కోడిగుడ్డు మెనూ ప్రకారం పెడుతున్నారా, కూరలు రుచిగా ఉంటున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి విద్యార్థికి చదివే సామర్థ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని ఇఅన్నారు. విద్యా ప్రమాణాల పెకంపుదలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. విద్యార్థులకు ముందుగా చదవడం, చదివింది అర్థం చేసుకోవడం అనే నైపుణ్యాలు రావడం చాలా కీలకమని అన్నారు. ఒక విద్యార్థికి చదివే సామర్థ్యం అందిస్తే జీవితాంతం ఉపయోగపడుతుం దని, విద్యార్థుల చదివే సామర్థ్యం పెంపు చేయడం కోసం చేపట్టిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అమలుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధన అందిం చాలని సూచించారు. ప్రతిరోజు విద్యార్థి గంటసేపు చదివే సామర్థ్యంపై అభ్యాసన చేసేలా సాంకేతిక పరిజ్ఞానంతో ఒక లుక్ లెట్ తయారు చేయడం జరిగిందని అన్నారు. ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం పర్యవేక్ష ణకు ఒక యాప్ తయారు చేశామని, దీనిని యుడిఐఎస్‌తో అనుసం ధానం చేసినట్లు, ప్రతి బుధవారం విద్యార్థి రీడింగ్ స్కిల్స్ ఏ స్థాయిలో ఉన్నాయో అక్షరాలు, పదాలు, వ్యాఖ్యలు అప్‌డేట్ మాత్రం చేయాలని అన్నారు. ఆంగ్ల అక్షరాలను ఫొనెటిక్ సౌండ్‌తో సహా నేర్పేలా కోర్సు డిజైన్ చేశామని అన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెడితే ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం పరిపూర్ణంగా అమలు చేయవచ్చని, ప్రతి విద్యార్థి కనీసం ఒక పేరాగ్రాఫ్ చదివి అర్థం చేసుకునే స్థాయికి చేరుకోవాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రులతో సంప్ర దింపులు జరిపి అవగాహన కల్పించాలన్నారు. చిన్న పిల్లలకు అందించే కోడిగుడ్డు, పోషకాహారం నాణ్యతను పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో వైరా తహశీల్దార్ సురేష్‌బాబు, మండల విద్యాధికారి కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దయాకర్‌రావు, రమేష్, శ్రీదేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం కార్పోరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలి



ప్రజాపక్షం/కొత్తగూడెం : కొత్తగూడెం కార్పోరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలని సిపిఐ రాష్ట్ర కార్య దర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పోరేషన్ ఎన్నికలకు సంబంధించి బరిలో ఉన్న అభ్యర్థులకు స్థానిక శేషగిరి భవన్ సిపిఐ కార్యాలయంలో ఆయన మంగళవారం బి ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఈనెల 11న జరగనున్న కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో భాగంగా సిపిఐ తన అభ్యర్థులను ప్రకటించిందని, టిడిపి, ప్రజా సంఘాల మద్దతుతో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ప్రజాక్షేత్రంలోకి వెళుతుందని చెప్పారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ఆధ్వర్యంలో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజ యానికి ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పూర్తిగా పార్టీ కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగానే కొత్తగూడెం కార్పోరే షన్ వ్యాప్తంగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల ముఖ్యమంత్రి, మంత్రులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నామనే భావన వద్దని, స్థానిక పరిస్థితులు, రాజకీయ సమీకరణాల్లో భాగంగానే ఈ నిర్ణయానికి వచ్చామన్నారు. గత రెండేళ్లలో కొత్తగూడెం నియోజకవర్గ వ్యాప్తంగా పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు జరిగిందని, మారుమూల ప్రాంతాల్లో సైతం మౌళిక సదుపాయల కల్పనకు శక్తివంచన లేని కృషి చేశామని, ఎన్నడూ జరగని అభివృద్ధి కొత్తగూడెం నియోజకవర్గంలో జరిగిందని, అనుక్షణం ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్నామని తెలి పారు. కార్పోరేషన్ ఏర్పాటుతో పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో 25సం. తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయని, దీంతో ఆ ప్రాంత అభివృద్ధి శరవేగం కానుందన్నారు. కార్పోరేషన్ కాకుండా ఆనే శక్తులు కుట్రలు పన్నాయని, వారి కట్రలు, కుతంత్రాలను పటాపంచలు చేస్తూ తామిచ్చిన నివేదిక ప్రకారం ప్రభుత్వం అనతికాలంలోనే కొత్తగూడెం కార్పోరేషన్‌ను ప్రకటించిం దన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, సిపిఐ అభ్యర్థులు గెలవడం ద్వారా కొత్తగూడెం కార్పోరేషన్ మరింత అభివృద్ధి పథంలో ముందుకు దూసుపోనుందని, కార్పోరేషన్ పై ఎర్రజెండా ఎగిరేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# కంకి కొడవలితో సైకిల్ దోస్తీ..!

(మొదటిపేజీ తరువాయి)
చేస్తున్నాయి.

**కార్పోరేషన్ పై కామ్రేడ్స్ గురి...**
కార్పోరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ఇప్పటికే కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా నేతృత్వంలో గ్రామ పంచాయితీ ఎన్నికల ఫలితాలను మదిలో పెట్టుకుని పార్టీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో ఉన్నారు. గత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ పొత్తు పదాన్ని వల్లిస్తూనే ఆ పొత్తు ధర్మాన్ని ఎక్కడా పాటించలేదు. దీంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిపిఐ కూనంనేని నేతృత్వంలో గట్టిపోటీ ఇచ్చి మెజర్ గ్రామపంచాయితీలతో పాటు పెద్ద ఎత్తున గ్రామ పంచాయితీలను కైవసం చేసుకుంది. ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో కార్పోరేషన్ ఎన్నికల్లో సైతం సిపిఐ ఒంటిరి పోరాటానికి రెడీ అయ్యింది. ఈ నెల 11న జరగ నున్న ఎన్నికల్లో అగ్రస్థానాల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులు అహర్నిశ లు శ్రమిస్తున్నారు. మొత్తం 60 డివిజన్లకు గానూ 31 డివిజన్లలో ఎవరు విజయం సాధిస్తే వారికే పీఠం దక్కనుంది. సిపిఐ కనీసం 35 నుండి 38 డివిజన్లలో గెలుపు తీరాలు చేరే అవకాశం ఉన్న ట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా. మిగతా మిగతా 10 నుండి 12 స్థానాల్లో గట్టిపోటీ ఇచ్చే అవ కాశం ఉన్నట్లు చెబుతున్నారు. అంచనాల మేరకు సిపిఐ 31 స్థానాలు దాటి విజయం సాధిస్తే మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలు కూడా కామ్రేడ్స్ ఖాతాలో పడనున్నాయి. ఎంఎల్ఏ కూనం నేని సాంబశివరావు రెండేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరిం చి మొత్తంగా కార్పోరేషన్‌ను సిపిఐ కైవసం చేసుకునేందుకు కసితో ముందుకు సాగుతోంది.

**ఇల్లెందు,అశ్వారావుపేట మున్సిపాలిటీల్లో...**
ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీల రాజకీయం కూడా రసవత్తరంగా ఉంది. ఇల్లెందు 22 వార్డులకు గానూ కాంగ్రెస్ 22 వార్డుల్లో పోటీ చేసింది. బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, న్యూడెమో క్రసీ మాస్‌లైన్‌ల పొత్తుతో అన్నివార్డుల్లో పోటీకి నిలిచాయి. ఇందులో సిపిఐ 10,23 వార్డుల్లో బరిలో ఉంది. ఇక్కడ బిజెపి 17, జనసేన 7 వార్డుల్లో పోటీలో నిలిస్తున్నాయి. అశ్వారావుపేట మున్సిపాలిటీకి సంబంధించి 22 వార్డులకు గానూ సిపిఐ 19 వార్డులో ఒంటరిగా నిలుస్తోంది. కాంగ్రెస్, సిపిఎం కలిసి ఎన్నికలకు పోతుండగా, బిఆర్ఎస్, టిడిపి జతకట్టాయి. ఇల్లెందు మున్సిపాలిటీలో గెలుపుకు కాంగ్రెస్‌కు అవకాశం ఉండగా, అశ్వారావుపేట మున్సిపాలిటీలో బిఆర్ఎస్, టిడిపి పొత్తుకు అనుకూల పవనాలు వీస్తున్నట్లు తెలుస్తోంది.

## కట్టా స్వరూపరాణి ఎన్నికల ప్రచారం

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 5వ వార్డులో సిపిఎం బలపరిచిన బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి మున్సిపాల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా కట్టా స్వరూపరాణి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పాత కూరగాయల మార్కెట్ ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కట్టా స్వరూపరాణి మాట్లాడుతూ అభివృద్ధి అంటే కెసిఆర్ అని అన్ని వర్గాల అభివృద్ధికి పెద్ద పీట వేశారని, సంక్షేమం అంటే ప్రజా సమస్యల పరిష్కారం వారి అభివృద్ధి కెసిఆర్ పాలన అని ప్రజలు మళ్లీ కెసిఆర్‌ని కోరుకుంటున్నారని అన్నారు. మీరందరూ ఆశీర్వదించి నన్ను గెలిపించాలని వైరా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ఉంచేందుకు ముందు ఉంటానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఎం, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

## కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**ప్రజాపక్షం/వైరా:** ఎన్నికల కమీషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టు దిట్టంగా నిర్వహించే సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మున్సిపాల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం వైరా తహశీల్దార్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన వైరా మున్సిపాలిటీ వార్డు అభ్యర్థుల బీఫామ్ పరిశీలన, స్వతంత్ర అభ్యర్థుల ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర తనిఖీ చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలు, బీఫామ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర అనుదీప దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి మున్సిపాల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించుటకు నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపాల్ కమీషనర్లు, ఇతర ఎన్నికలకు కేటాయించిన అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో కలిసి పనిచేసి మన జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా జరిగే విధంగా అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ఎన్నికలకు కేటాయించిన అధికారులందరూ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల తర్వాత ఉపసంహరణ, రాజకీయ పార్టీల బీఫామ్ పరిశీలన చాలా ముఖ్యమైన అంశమని వివరించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని, నామినేషన్ల అప్పీళ్ళ పరిష్కారం, బీఫామ్ లేని అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా ప్రకటన, గుర్తుల కేటాయింపు పారదర్శకంగా కేటాయించాలని సూచించారు. ఎలాంటి తొందరపాటు లేకుండా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రచార నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, సౌండ్ సెట్, వాహనానికి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలని, ఎక్కడ కూడా పోటీదారులకు ఒకే రూట్‌లో సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు అనుమతి జారీ చేయవద్దని అన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే పట్టుకొని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా తహశీల్దార్ సురేష్‌బాబు, మున్సిపాల్ కమీషనర్ గురులింగం, ఎంపిడివో తేజావత్ సక్రియ, ఎంఈవో వెంకటేశ్వర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులు అరెస్టు

## -80 కేజీల కాపర్, 66 కేజీల అల్యూమినియం వైరు స్వాధీనం

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ట్రాన్స్‌ఫార్మర్‌లలోని కాపర్ వైరు చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను రఘునాథపాలెం పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 80 కిలోల కాపర్ వైరు, 66 కిలోల అల్యూమినియం వైరును స్వాధీనం చేసుకున్నారు. సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం... ఏసిపి ఎస్‌వి రమణమూర్తి ఆదేశాల మేరకు రఘునాథపాలెం సిఐ ఎండి ఉస్మాన్ షరీఫ్ సారథ్యంలో ఎస్ఐ జి. నరేష్ తన సిబ్బందితో కలిసి రఘునాథపాలెం ఆపిల్ సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా టిఎస్04యుఏ1808 నెంబరు గల ఆటోలో అల్యూమినియం వైరు పెట్టకుని ఖమ్మం వైపు వెళ్తుండగా అందులో ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఖమ్మం అర్బన్ కైకొండాయిగూడెంకు చెందిన పిట్టల గోపి, అంగోతు ఉమాశంకర్, శీలం నాగేశ్వరరావు, మందా ఛత్రపతి, వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఆకుల నాని, రమణగుట్టకు చెందిన బజ్జా కృష్ణలుగా గుర్తించారు. ఈ ఆరుగురు కలిసి ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రఘునాథపాలెం మండలం కామేపల్లి మండలం ముదిగొండ మండలం, కూసుమంచి మండలం, కొణిజర్ల మండలం, తల్లాడ మండలం, బోనకల్ మండలం, తిరుమలాయపాలెం మండలం, ఖానాపురం





హవేలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును చోరీకి పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. చోరీ చేసిన కాపర్ వైర్లను బజ్జా కృష్ణ పాత ఇనపకొట్టుకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సా చేసే వాడని సిఐ తెలిపారు. వీరిపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌తో పాటు కమిషనరేట్ పరిధిలో 18 కేసులు నమోదయ్యాయని సిఐ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 80 కేజీల కాపర్ వైరు, 66 కేజీల అల్యూమినియం వైరు చుట్టలను, రెండు సెల్‌ఫోన్స్, రవాణాకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది ఎన్ఎస్ రాజు, బి. శ్రీనివాసులు, ఎండి అహ్మద్ అలీ, వి. నవీన్ పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల సమ్మె నోటీస్ అందజేత



**ప్రజాపక్షం/ బోనకల్:** ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆశావర్కర్ల యూనియన్ మధిర డివిజన్ కార్యదర్శి రామన్న సరోజిని కోరారు. మంగళవారం బోనకల్ మండల పిహెచ్‌సి వైద్యాధికారికి సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.26వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొంగర వెంకటరమణ, మరీదు ఉషారాణి, లీలావతి, వేల్పుల యశోద, నక్కల నారాయణమ్మ, ఈ.విజయ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదు..



**ప్రజాపక్షం/ బోనకల్ :** మోసపు వాగ్దానాలతో మాయ మాటలతో ఆరు గ్యారంటీ పథకాలు పేరుతో అధికారంలోకి వచ్చిన వాటిని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు విమర్శించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్ నాయకులు లేదని విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో సిపిఎం పార్టీ కార్యాలయంలో మంగళవారం జొన్నలగడ్డ సునీత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల పొట్ట కొడుతుందని, నాలుగు లేబర్ కోడ్‌ల వలన కార్మికులు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రజా, కార్మిక, రైతు, ఉద్యోగ, వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం నిరంతరం పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. మధిర మున్సిపాలిటీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసంఘటితంగా కార్మికుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తుందని సిపిఎం మాత్రమేనన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 12న నిర్వహించనున్న కార్మికుల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, నాయకులు పెద్దపోలు రామారావు, గుద్దూరి వెంకటనర్సయ్య, ఉప్పర శ్రీను, పసుపులేటి నరేష్, బంధం శ్రీనివాసరావు, నల్లమోతు వాణి, తెల్లాకుల శ్రీనివాసరావు, తాత వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానానికి రూ.లక్ష విరాళం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహాశివరాత్రి పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి బిఆర్ఎస్ నగర యూత్ అధ్యక్షులు దేవభక్తిని కిషోర్‌బాబు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఇల్లందు రోడ్డు కైకొండాయి గూడెం రోడ్డులో గల శ్రీ విశాలక్ష్మి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 15న మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి దేవభక్తిని కిషోర్‌బాబు లక్ష రూపాయలు విరాళాన్ని ఆలయ ఛైర్మన్, ఆరవ డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరుపున దేవభక్తిని కిషోర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి వారి కుటుంబ సభ్యులకు శివుని ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని కోరారు.

# ఉపాధ్యాయ సంఘాల ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐజెసి టివో, ఆలిండియా జాక్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం ఖమ్మంలోని పిఆర్‌టియు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఐఎఫ్‌టివో జాతీయ ఉపాధ్యక్షులు చిత్తలూరు ప్రసాద్ ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్‌రావు, మాజీ అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి), నాయకులు రాయల నర్సింహారావు, తాళ్లూరు చంద్రశేఖర్, లింగం సతీష్, గుర్రం కేశవరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# పలు వార్డులకు ఇంచార్జీలుగా బిఆర్ఎస్ మండల నాయకులు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** వైరా మున్సిపాలిటీలో పలు వార్డులకు రఘునాథపాలెం మండలంకు చెందిన బిఆర్ఎస్ నాయకులు ఇంచార్జీలుగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 11న ఎన్నికలు జరగనున్న వైరా మున్సిపాలిటీలో 15, 16, 17, 18, 19 వార్డులకు సంబంధించి మండలంకు చెందిన బిఆర్ఎస్ నాయకులు ఇంచార్జీలుగా వ్యవహరిస్తూ అభ్యర్థుల ప్రచారంలో పాల్గొంటున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంకు చెందిన పలువురు నాయకులు బిఆర్ఎస్ అభ్యర్థుల తరుపున గెలుపే లక్ష్యంగా వీరు స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ వైరాలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అజ్మీర వీరునాయక్, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవికుమార్, కోటపాడు సర్పంచ్ కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షులు మాధంశెట్టి హరిప్రసాద్, మాజీ ఆత్మ ఛైర్మన్లు మెంటెం రామారావు, భూక్యా లక్ష్మణ్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ పిన్ని కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ చెరుకూరి ప్రదీప్, నున్నా శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ కెవిఆర్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం సీనియర్ నేత చల్లా నర్సయ్య మృతి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ సిపిఎం పార్టీ ఉద్యమ నాయకుల్లో ఒకరైన సీనియర్ నేత చల్లా నర్సయ్య(92) మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం పార్టీ నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పార్టీ జెండాను కప్పి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లాడ పట్టణంలో సిపిఎం పార్టీ ఉన్నది అంటే దానిలో ప్రధాన బాధ్యులు చల్లా నర్సయ్య అని, కమ్యూనిస్టుగా ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పోరాటంలో నర్సయ్య కీలక పాత్ర పోషించారన్నారు. నర్సయ్య అకాల మృతి సిపిఎం పార్టీకి తీరని లోటన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యల పోరాటంలో సిపిఎం నాయకులు ముందుకు సాగాలని అన్నారు. మృతునికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ నాయకులు నల్లమోతు మోహన్‌రావు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, చల్లా నాగేశ్వరరావు, సత్తెనపల్లి నరేష్, షేక్.మస్తాన్, గాలి వెంకటాద్రి, సిఐటియు బాధ్యులు పెరిక శ్రీనివాసరావు, సిపిఐ మండల కార్యదర్శి ఉర్సు రమేష్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థిగా ఫణితి సైదులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్‌కు అత్యంత స్నేహితుడు, పట్టణ కాంగ్రెస్ నాయకుడు ఫణితి సైదులును అధిష్టానం ఎంపిక చేసి బీఫాం అందించింది. సమాజంలో సేవా కార్యక్రమాల్లో తనకంటూ ప్రత్యేకతను ఫణితి సైదులు చాటుకున్నారు. వార్డులో గత ఐదు సంవత్సరాలుగా సైదులు భార్య ఫణితి ఉష కౌన్సిలర్ తొలి మున్సిపాలిటీ పాలకవర్గంలో పనిచేసింది. అదేవిధంగా వార్డులో ఎంతోమందికి ఆపదలో ఉన్నవారికి తనవంతు అండగా ఉంటూ ఆర్థిక చేయూతనందిస్తూ నేనున్నానని భరోసా ఇస్తున్న ఫణితి సైదులు ఎంపిక పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కర్షక, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 12న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు మద్దాల ప్రభాకర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ సంఘం నాయకులు ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్‌కు ఆశా కార్యకర్తలు సమ్మె నోటీస్‌ను మంగళవారం అందచేశారు. ఈనెల 12న జరగనున్న ఒక్కరోజు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు నంద్రు సుధారాణి, ధనలక్ష్మి రుక్మిణి, రమాదేవి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు తప్పనిసరి



ప్రజాపక్షం/ బోనకల్ : మండలంలో పట్టాదారు పాస్ బుక్ కలిగిన ప్రతిరైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేసుకోవాలని మధిర సహాయ వ్యవసాయసంచాలకులు స్వర్ణ విజయచంద్ర తెలిపారు. మంగళవారం ముష్టికుంట్ల రైతు వేదిక నందు రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. ప్రతి రైతు తన విశిష్ట సంఖ్య( ఫార్మర్ ఐడి) పొందడానికి పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు నెంబర్‌తో వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధాన మంత్రి ఫసల్ బీమా, రాష్ట్రీయ కృషి వికాస్‌యోజన, జాతీయ ఆహార భద్రత మిషన్ లాంటి పథకాలు రైతులకు అందాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరి, రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పసునూరి వినయ్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి మరీదు త్రివేణి, రైతులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల నుండి రాజకీయ రంగ ప్రవేశం

### వుంద్రు వరలక్ష్మి కి కాంగ్రెస్ బీఫామ్



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా లయన్ ఐ కేర్ నిర్వాహకులు వుంద్రు శ్యామ్ బాబు సతీమణి వుంద్రు వరలక్ష్మి కి కాంగ్రెస్ బీఫామ్ ను అందజేశారు. తొలిసారి సేవా కార్యక్రమాల నుండి రాజకీయ రంగంలోకి యువకురాలైన వుంద్రు వరలక్ష్మి రాజకీయంలోకి కాలు పెడుతున్నారు. గత కొన్ని ఏళ్లుగా వుంద్రు శ్యామ్‌బాబు, వరలక్ష్మి దంపతులు ప్రముఖ వైద్యులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, డాక్టర్ చంద్రకళ ఆశీస్సులతో లయన్ ఐ కేర్ ద్వారా ఎంతోమందికి సేవా కార్యక్రమాలు చేస్తూ ఉచిత సేవలు అందించారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచారు. ఈ నెల11న జరగనున్న మున్సిపాల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిగా పోటీ చేస్తున్న వుంద్రు వరలక్ష్మి కి పలువురు అభినందనలు తెలిపారు. రాజకీయాల్లో వరలక్ష్మి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన సర్పంచ్



ప్రజాపక్షం/కరకగూడెం: చిర్రమల్ల గ్రామ పంచాయతీ పరిధిలోగల స్కూల్స్ (పోలకమ్మ తోగు స్కూల్, చిరుమళ్ళ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, రాయనపేట స్కూల్, కౌలూరు స్కూల్) లను సర్పంచ్ కొమరం సుగుణ ఆధ్వర్యంలో విజిట్ చేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరిచే కొన్ని అంశాలైన నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలు, విద్యార్థుల గైర్హాజరుపై నిఘా వంటి అంశాలపై ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు రిప్రెసెంటేషన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పశువుల రవాణాదారులపై కేసు నమోదు



ప్రజాపక్షం/మణుగూరు: మంగళవారం తెల్లవారుజామున మణుగూరు నుంచి వి ఎం బంజరుకు టాటా ట్రాలీ నందు కట్టివేసి తీసుకు వెళుతున్న ఏడు పశువులను రక్షించడం జరిగిందని పోలీస్‌లు తెలిపారు. వీటిని వెంటనే పాల్వంచలోని గోశాలకు తరలించడం జరిగింది తెలిపారు. దీనికి సం బంధించి మణుగూరుకు చెందిన మహమ్మద్ హైమద్, ఎండి యాకూబ్ పాషా, కల్లూరు కు చెందిన షేక్ అజ్మత్ పై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఎవరైనా పశువుల అక్రమ రవాణా చేసినట్లయితే వారిపై కఠినమైన చర్యలు తీసుకోబడతాయని ఈ సందర్భంగా తెలియజేయడమైనది. ఎవరికైనా పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే వెంటనే అశ్వాపురం ఎస్‌హెచ్‌ఓ నంబరు 8712682093కి తెలియజేయాలని తెలిపారు.

## యువతకు దక్కిన ఎర్రని గౌరవం

- ఏదులాపురం సిపిఐ పార్టీ ఖ్యాతిని పెంచిన నిర్ణయం
- శ్రీనాథ్‌రెడ్డి అభ్యర్థిత్వంపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- 32వ డివిజన్లో జోరుగా సాగుతున్న ప్రచారం








ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : యువత రాజకీయాలలోకి రావాలనే మాటను వింటూనే ఉంటాం...రాజకీయ ఉపన్యాసాలు చూస్తునే ఉంటాం.. చివరికి అది ఆచరణకు మాత్రం ఆమడ దూరంలో ఉంటుంది. కానీ ఏదులాపురం ఎర్రతోటలో యువతకు పెద్ద పీఠ వేశారు. లండన్‌లో ఉద్యోగం వదిలి సిపిఐ పార్టీ తరపున ప్రజా సేవ చేస్తున్న మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డికి పట్టం కట్టారు. ఇది యువతకే కాకుండా సిపిఐ పార్టీలో నాలుగు తరాలుగా కొనసాగుతున్న కుటుంబానికి దక్కిన సముచిత గౌరవంగా లిఖించబడునుంది. ఈ నిర్ణయంతో సిపిఐ పార్టీ ఖ్యాతిని మరింత ఇనుమడింప చేసింది. అలాగే అభ్యర్థిత్వంపై ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుండటం నిర్ణయానికి నిలువుటద్దంగా నిలిచింది. ఈ నేపథ్యంలో 32వ వార్డులో జోరుగా సాగుతున్న ప్రచారం సాక్షిగా ఎర్ర జెండా రెపరెపలను ప్రస్ఫుటితం చేస్తుంది.

### ప్రత్యర్థుల దాడికి దీటుగా...

మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి , తండ్రి నిరంజన్‌రెడ్డి మొదలుకొని, తాత ముత్తాతలు సిపిఐ పార్టీలోనే కొనసాగారు. ఈ నేపథ్యంలో ప్రత్యర్థుల దాడులలో నలిగిపోయారు. సిపిఐ పార్టీకి ఈ కుటుంబమే బలంగా ఉందని, తలచి లూటీలు చేసి భయకంపితులను చేశావారు. ఇలా ఆస్తి నష్టం చేయడంతో పాటు పంటలను సైతం ధ్వంసం చేశావారు. అంతటితో ఆగకుండా ఆ కుటుంబాన్ని ప్రజల నుంచి వేరు చేసి ఇంటిని ఒంటరి చేశారు. అయినప్పటికీ వీటికి వెరవెకుండా ఆ కుటుంబ నాటి నుంచి సిపిఐ పార్టీలోనే కొనసాగుతూ ఉంది.

### లండన్‌లో జాబు వదిలేసి...

మంచి ఆస్తిపాస్తులు, కోరుకున్న కుటుంబం, లండన్ లాంటి దేశంలో మంచి ఉద్యోగం. అయినప్పటికీ వీటన్నింటినీ వదిలేసి తన సొంత ఊరికే వచ్చాడు. ఇక్కడ సిపిఐ పార్టీ తరపున (ఏఐవైఎఫ్) అఖిల భారత యువజన సమాఖ్యలో క్రియాశీలకంగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఊరిలో ప్రజలకు సేవలను అందిస్తూ చురుకుగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. యువత సమస్యలపై ఇచ్చిన పిలుపులోను బాధ్యతగా వహించేవాడు. అలా తనకుంటూ సిపిఐ పార్టీ ద్వారా ఓ గుర్తింపును సొంతం చేసుకున్నాడు. ఇలా తనకు అందివచ్చిన 32వ డివిజన్లో సిపిఐ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగి ముమ్మర ప్రచారంలో ముందుకు సాగుతున్నాడు.

### ఆసీనే రిపీట్ కానుందా...?

ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలవేళ ఆసీనే రిపీట్ కానుందా? అనే చర్చ జోరుగా సాగుతుంది. సిపిఎం నుంచి వెంపటి రామకోటయ్యసిపిఐ నుంచి నిరంజన్‌రెడ్డి సొసైటీ ఎన్నికల్లో పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో నిరంజన్‌రెడ్డి గెలుపొందారు. ఇప్పుడు తాజాగా జరుగుతున్న ఎన్నికలలో ఓటమిపాలైన రాంకోటయ్య కుమారుడు బరిలో నిలవగా...అతనికి ఎదురుగా నిరంజన్‌రెడ్డి కుమారుడు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి నిలబడ్డాడు. ఈ నేపథ్యంలో గత సీన్ రిపీట్‌ఐ పార్టీ గెలుస్తుందనే ధీమా ఆ శిబిరం నుంచి వ్యక్తమౌతుంది.

## బిఆర్ఎస్, సిపిఎం సమన్వయం

23 వార్డులకు కౌన్సిలర్ అభ్యర్థుల ప్రకటన
బీ ఫార్మలు అందించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర



ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్‌సీపీఎం మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు కౌన్సిలర్ అభ్యర్థులను ఖరారు చేసి, వారికి బిఫార్మలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మంగళవారం అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు బలమైన ప్రజాధారణ ఉందని, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలే తమ విజయానికి మూలస్తంభమని పేర్కొన్నారు. సీపీఎంతో కలిసి పోటీలోకి దిగడం ద్వారా ప్రజాస్వామ్య శక్తులను మరింత బలోపేతం చేయాలన్నదే లక్ష్యమన్నారు.

### వార్డుల వారీగా అభ్యర్థుల వివరాలు...

మొత్తం 23 వార్డుల్లో 22 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు, 1 వార్డులో (వార్డు19) సీపీఎం అభ్యర్థిని బలపరచడం జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థులు:01 వ వార్డు మరుతి సూరిబాబు, 02 వ వార్డు వీరపనేని రాధిక, 03 వ వార్డు కుసంపూడి మాధురి, 04వ వార్డు షేక్ కరీముల్లా, 05వ వార్డు కొనేటి అనురాధ, 06వ వార్డు చిన్నంశెట్టి రాజ్యలక్ష్మి ,07వ వార్డు రామిశెట్టి రాజేశ్వరి,08వ వార్డు షేక్ చంద్ పాషా,09వ వార్డు పూజాల రవి,10వ వార్డు అరేంపుల ఆనంద రావు,11వ వార్డు జాన్ మొహమ్మద్ మిర్జా, 12వ వార్డు జొన్నలగడ్డ లత, 13వ వార్డు గుంజా పెదమంగా, 14వ వార్డు కుసంపూడి మహేష్, 15వ వార్డు అక్షింతల వెంకటరమయ్య, 16వ వార్డు అద్దంకి అనిల్ కుమార్, 17వ వార్డు కొత్తూరు తులసి, 18వ వార్డు తూతా లక్ష్మి కుమారి, 20వ వార్డు బెల్లంకొండ రాము, 21వ వార్డు మల్లూరు అంకమ్మ రాజు, 22వ వార్డు మాటూరి భవాని, 23వ వార్డు షేక్ సహీరా బేగం, సీపీఎం అభ్యర్థి 19వ వార్డు పాకలపాటి లక్ష్మి లను ప్రకటించి బి.ఫార్మలను అందించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ సత్తుపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ఇప్పటికే బలమైన స్థానాన్ని కలిగి ఉందని. ఈసారి సీపీఎంతో పొత్తు పెట్టుకోవడం ద్వారా ఓటు చీలికను అడ్డుకోవడం, కార్మిక, పేద వర్గాల మద్దతును సమీకరించడమే ప్రధాన వ్యూహంగా పని చేస్తుందన్నారు. అభ్యర్థుల ఎంపికలో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా అన్ని సామాజిక వర్గాలను కలుపుకుపోయే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. అభ్యర్థుల్లో ఎక్కువ మంది స్థానికంగా గుర్తింపు ఉన్నవారే కావడం బీఆర్ఎస్‌కు అదనపు బలం కానుంది. మొత్తంగా చూస్తే, బీఆర్ఎస్‌సీపీఎం సమన్వయం సత్తుపల్లి మున్సిపాలిటీలో ఎన్నికల ఫలితాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మున్సిపల్ కమిషనర్‌కు కర్నే రవి వినతి



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో దోమల ఉధృతిని నివారించేందుకు అన్ని వార్డులలో ఫాగింగ్ మందు పిచికారీ చేయాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అనేక వార్డులలో మురుగు కాలువలు సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల, ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగి దోమలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు. దీనివల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వంటి ప్రమాదకరమైన సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతు న్నారని అన్నారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, సమస్యపై సానుకూలంగా స్పందించి, త్వరలోనే తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు కర్నే రవి తెలిపారు.

## గెలుపే లక్ష్యంగా పోరాడాలి

- వందశాతం ఫలితాలు సాధించాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా



ప్రజాపక్షం/పాల్వంచ : కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికలలో నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పోరాడాలని, వందం శాతం ఫలితాలను సాధించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా అన్నారు. కార్పోరేషన్ పరిధి పాల్వంచ డివిజన్ నుండి పోటీలో నిలిచిన అభ్యర్థుల బి. ఫారాలను పార్టీ కార్యాలయం చండ్రా రాజేశ్వర రావు భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథంకు మంగళవారం అందజేశారు. ఈ సంధర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఇంటింటికి వెళ్ళి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఆయా డివిజన్ పరిధిలో ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. నాయకులు, కార్యకర్తల సహాయ సహకారాలను తీసుకొంటూ ప్రచారాన్ని పరుగులు పెట్టించాలని చెప్పారు. ప్రణాళికా ప్రకారం ప్రచారం చేస్తే విజయం దక్కుతుందని, ఏ చిన్న అవకాశాన్ని జారవిడుచుకోవద్దన్నారు. ఏమాత్రం విశ్రమించినా ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యర్థి పార్టీల అంచనాలను తెలుసుకొంటూ ప్రచారాన్ని కొనసాగించి గెలుపు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు దుగ్గిరాల సుధాకర్, శనగారపు శ్రీనివాస్, వైఎస్. గిరి, వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, వల్లపు యాకయ్య, చెరుకూరి శేఖర్‌బాబు, మొగులూరి క్రిష్ణ, మహమ్మద్ అస్లాం, కంటెస్టెడ్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన వెంగళరావు సాగర్ ప్రాజెక్ట్

-రూ 33.50 కోట్లతో పనులు



ప్రజాపక్షం/చండ్రుగొండ: మండల పరిధిలోని వెంగళరావు సాగర్ ప్రాజెక్టు అలుగు నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. భారీ వర్షాలకుల అలుగు పూర్తిగా కొట్టుకుపోవడంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అలుగు నిర్మాణ పనులకి ఎంఎల్ఏ, మంత్రులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పెడచెవిని చేట్టారు. మాజీ మంత్రి జలగం ప్రసాద రావు చొరవతో జాతీయ ఎస్టీ కమిషన్ జోక్యంతో అలుగునిర్మాణానికి అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ 33.55 కోట్లు నిధులు మంజూరు చేయించారు. దీంతో సదర్ కాంట్రాక్టర్ అలుగు నిర్మాణాలను గత 15 రోజుల నుండి ముమ్మరంగా చేపట్టారు. ఈ ప్రాజెక్ట్ కింద సుమారు 2,200 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టు గ్రామాలైన దామరచర్ల, సీతయ్య గూడెం, చండ్రుగొండ, తిప్పనపల్లి, మహమ్మద్‌నగర్ గ్రామాలకు భూములు ఉన్నాయి. వచ్చే ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేసేలా ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణ చేస్తూ వేగవంతం చేశారు. పూర్తయితే మరో ఎనిమిది వందల ఎకరాలు సాగు చేసే అవకాశం ఉంటుంది. అలుగు నిర్మాణం పనులు చేపట్టడంతో రైతులు, అదే విధంగా మత్స్యకారులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి

-గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి
-ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్





ప్రజాపక్షం/బూర్గంపాడు: మారుమూల గిరిజన గ్రామాల నుండి నిరుపేదలైన గిరిజనులు సిహెచ్‌సి ఆసుపత్రికి వస్తూ ఉంటారని వారి పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపి అన్ని రకాల టెస్టులు నిర్వహించి తప్పని సరిగా వైద్య సేవలు అందించాలిన, ముఖ్యంగా గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. మంగళవారం బూర్గంపాడు ప్రభుత్వ సిహెచ్‌సి వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి లేబరేటరీ, ఆపరేషన్ థియేటర్, గర్భిణీ స్త్రీల కాన్పుల గది, అవుట్ పేషెంట్ల గది, అల్ట్రా సౌండ్ స్కానింగ్ గది, మందుల నిల్వ చేసే గది, కొత్తగా నిర్మాణం చేపడుతున్న సిహెచ్‌సి పనులను పరిశీలించారు. రోగులకు అందుతున్న స్కానింగ్ సేవలు, అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల, స్టోర్ రూమ్‌లో ఉన్న మందుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సౌకర్యాల గురించి అవుట్ పేషెంట్లను, వార్డులలో వైద్య సేవలు పొందుతున్న పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంత ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వివిధ రకాల జబ్బులకు వైద్యం చేయించుకోవడానికి గిరిజనులు వస్తూ ఉంటారని, వారికి సరైన వైద్యం చేసి మందులు అందజేయాలన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలు ఇబ్బంది పడకుండా వారి గ్రామాల నుండి అంబులెన్స్‌లో తీసుకొని రావాలని, డెలివరీ అయ్యే వరకు పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉన్నది లేనిది పరిశీలించి, తల్లితో పాటు బిడ్డ కూడా సక్రమంగా వైద్యం చికిత్సలు చేయాలన్నారు. పిహెచ్‌సి పరిధిలో పని చేసే సిబ్బంది గర్భిణీ స్త్రీల పట్ల జాగ్రత్తలు తీసుకొని వారికి నెలసరి చికిత్సలు ఏ విధంగా తీసుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. వాతావరణం మార్పులు వలస సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిహెచ్‌సి ఆసుపత్రిలో పని చేసే డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండాలని, ఆస్పత్రికి వచ్చే రోగులను ఆస్పత్రిలోనే వైద్య సేవలు అందించాలని, వివిధ రకాల టెస్టుల కోసం పేషెంట్లను ఎవరిని ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపించకూడదని, ఎవరైనా పేషెంట్లు ప్రైవేట్ ల్యాబ్‌లలో టెస్టింగులు నిర్వహించినట్లు తన దృష్టికి వస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే ఆసుపత్రి పరిసరాలు వార్డులు ప్రతిరోజు శుభ్రంగా ఉంచాలని అన్నారు. రెండు కోట్ల 70లక్షల రూపాయలతో నిర్మాణం చేపడుతున్న కొత్త సిహెచ్‌సి పనులలో వేగవంతం చేసి వర్షాకాలం వచ్చే సరికి కొత్త భవనంలో సిహెచ్‌సి నడిచే విధంగా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడిఎంహెచ్‌వో సైదులు, ఆసుపత్రి పర్యవేక్షకుడు ముక్కంటేశ్వరరావు, సర్పంచ్ మందా నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ కుమార్, డాక్టర్లు అనిత, నిషార్, సిహెచ్‌సి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పనితీరుపై పివో ఆగ్రహం

-ఉద్దీపకరం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు హుడ్ యార్డులోని జిసిఎస్ పాఠశాలను ఐటిడిఏ పివో రాహుల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉద్దీపకం వర్క్ బుక్‌లోని పదాలను ఇతర అంశాలను విద్యార్థుల చేత బోర్డుపై వ్రాయించి దానికి సంబంధించిన తాత్పర్యాలు పిల్లలను అడగగా వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో సంబంధిత ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారుల విద్యాభ్యాసం బలోపేతం కావడానికి ఉద్దీపకం వర్క్ బుక్ ప్రవేశపెట్టడం జరిగిందని, ఉద్దీపకం వర్క్ బుక్‌లోని పదాలు విద్యార్థులు సరిగా చెప్పకపోవడం ఉపాధ్యాయుల పనితీరు ఎలా ఉందో అర్థమయిపోతుందన్నారు. ఈనెలలో మరల ఈ పాఠశాలను సందర్శిస్తానని ఈ లోపల పిల్లలందరూ ఉద్దీపకం వర్క్ బుక్‌లోని ప్రతి పదాలు, గుణకారాలు, భాగాహారాలు, చతుర్వేదికలు అన్ని పిల్లలు చెప్పే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. లేని యెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించి పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులందరినీ పరీక్షలు సక్రమంగా రాసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

## 12న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/కారేపల్లి: కార్మిక కర్షక మైత్రితో ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయపద్రం చేయాలని సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కే నరేంద్ర ఆశా వర్కర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం జరిగిన ఆశ వర్కర్ల జనరల్ బాడీ సమావేశం వాంకుడోత్ కమల అధ్యక్షతన జరగగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ బిల్లులుగా తీసుకొచ్చిన ఫలితంగా గత 100 సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులన్నీ కాలరాసినట్లు విమర్శించారు. శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 12 సమ్మెలో భాగంగా ఆశా వర్కర్స్‌కు 26వేల కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా సమ్మె నోటీసును కారేపల్లి పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ సురేష్‌కు అందజేశారు. ఈ జనరల్ బాడీలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఎల్లబోయిన రాధ, మండల కార్యదర్శి పద్మ, మండల కమిటీ సభ్యులు జంగా కళ్యాణి, ఈసాల ఈశ్వరి, మేదరి కుమార్, ఆదర్ల దేవకరుణ, సరస్వతి, బుజ్జి పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/జూలూరుపాడు: ఫిబ్రవరి 12న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయ ప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ భద్రాద్రి కొత్తగూ డెం జిల్లా ఉపాధ్యక్షులు ఏధులాపురం గోపాల రావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాల యంలో కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా గోపాలరావు మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్ల ప్రజలు, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించిన జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ లు 2026 ఫిబ్రవరి 12న ఒకరోజు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టియుసిఐ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు రాయల సిద్ధు, కార్మికులు రాధ స్రవంతి స్వరూప, రమాదేవి, రజిత, శ్రావణి, సునీత, లక్ష్మి , అరుణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఉప సంహారణలు

- గుర్తులు కేటాయించిన అధికారులు

ప్రజాపక్షం/అశ్వారావుపేట : నూతనంగా ఏర్పడ్డ అశ్వారావుపేట మున్సిపాలిటీ తొలి కౌన్సిలర్ అభ్యర్థులుగా 146 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉప సంహరణ ముగుస్తుండటంతో 68 మంది వారి నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన కాంగ్రెస్ సిపిఎం పొత్తులో భాగంగా 22బి ఫారాలను 21 కాంగ్రెస్, ఒకటి సిపిఎం, టిఆర్ఎస్ తెలుగుదేశం పొత్తులో భాగంగా 22 బిఫారాలు 21 టిఆర్ఎస్, ఒకటి టిడిపి అభ్యర్థులు నామినేషన్ అధికారులకు సమర్పించారు. సిపిఐ పార్టీ నుండి 19వ వార్డు సభ్యులుగా తిరునాటి సంజయ్ బరిలో నిలిచారు. పెద్ద మొత్తంలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులను బుజ్జగించి కొంతమేరకు ఉపసంహరణ చేయించారు. ఇంకా ఒకటి రెండు వార్డులు మినహా మిగిలిన అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీకి రెబల్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. దీంతో పాటు బిజెపి ఆధార్ పార్టీ ఆర్డిల్ పార్టీలు కూడా కొన్ని వార్డుల్లో పోటీలో నిలిచారు. మొత్తం22 వార్డుల్లో 68మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు ద్రోహికరించారు. పోటీలో ఉన్న కాంగ్రెస్ టిఆర్ఎస్ సిపిఎం సిపిఐ ఒంటరిగా పోటీలో ఉన్న జనసేన పార్టీ గుర్తులు కేటాయించగా ఆధార్ ఆర్డ్ఎల్ పార్టీలతో పాటు మిగిలిన కాంగ్రెస్ రెబల్ స్వతంత్ర అభ్యర్థులకు సైతం గుర్తులను కేటాయించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో నిబద్ధతకే పట్టం





**- పార్టీ కోసం పనిచేసిన వారికే గౌరవం**
**- కష్టపడ్డ వారికి అవకాశం**
**- డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క రాజకీయ చతురత**

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ ఎన్నికల్లో భాగంగా అధికార కాంగ్రెస్ పార్టీ నుండి అభ్యర్థుల ఎంపికలో మరోసారి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క తన రాజకీయ చతురతను చాటారు. కాంగ్రెస్ పార్టీ నమ్ముకుని కష్టపడే వారికే అభ్యర్థులుగా ఎంపిక చేసి పార్టీ కోసం పనిచేసిన వారికి గౌరవం, కష్టపడే వారికి అవకాశం ఇచ్చినట్లు కన్పిస్తుంది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్లలో పార్టీపై అంచంచల విశ్వాసంతో నిలబడిన వారికి పార్టీలో దీర్ఘకాలంగా అంకితభావంతో సేవలందించిన సీనియర్ కార్యకర్తలకు, అలాగే నిజాయితీగా ప్రజాసేవలో ముందుడిన నేతలకు పార్టీ అధిష్టానం అత్యంత ప్రాధాన్యత కల్పించింది. పార్టీ కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పనిచేసిన వారిని గుర్తించి వారికి టికెట్లు, కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా నిబద్ధతకు పట్టం కట్టినట్లు పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా డబ్బు ఉంటేనే మున్సిపల్ ఎన్నికల్లో సీటు వస్తుందని అనుకునే వారికి భిన్నంగా సామాన్యులకు కూడా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కల్పించారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మున్సిపల్ ఎన్నికల్లో పోటీ సే అభ్యర్థులపై తీసుకున్న నిర్ణయం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. పురపోరులో కాంగ్రెస్, టిడిపి కూటమి అభ్యర్థులు గెలవటం ఖాయమని పలువురు తెలుపుతున్నారు.

### 22 వార్డులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు...

1వ వార్డు దోర్నాల శిరీష, 2వ వార్డు బాణావతు రమణనాయక్, 3 బెజ్జం రాజు, 4 సామినేని సుజాత, 5 పిల్లి సునీత, 6 వేమిరెడ్డి లక్ష్మీతులసీ, 7 శీలం నర్సిరెడ్డి, 8 యన్నం కోటేశ్వరరావు, 9 చారులత, 10 కట్కూరి రేవతి(టిడిపి), 11 గద్దల మాధురి, 12 మోదుగు నాగలక్ష్మి, 13 రషుద్దీన్, 14 వెంకట్రావు, 15 నగిరికంటి రాజేశ్వరి, 16 వంకాయలపాటి వెంకటనాగేశ్వరరావు(టిడిపి), 17 ములకలపల్లి వినయ్‌కుమార్(టిడిపి), 18 కోన ధనికుమార్, 19 మనుగోటి వెంకటేశ్వర్లు, 20 బోల్లెద్దుల విజయకుమారి, 21 రంగా రూప, 22వ వార్డు దారా నాగార్జున మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు.

# మేడారం జాతర ఆదాయం రూ.3.28 కోట్లు



**-ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం రీజియన్ పరిధిలో 214 బస్సు సర్వీ సులను నడపడం ద్వారా రూ.3,28,39,181 ఆదాయం వచ్చిందని, 203863 మంది ప్రయాణికులు బస్సులో ప్రయాణించినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 25 నుండి 31 వరకు ప్రత్యేక బస్సులను జాతరకు నడిపినట్లు తెలిపారు. ఖమ్మం డిపో పరిధిలో ఖమ్మం, ఇల్లందు పాయింట్ల నుంచి 41 బస్సులను నడిపినట్లు ఆయన తెలిపారు. రూ.6066398 ఆదాయం వచ్చిందన్నారు. సత్తుపల్లి డిపో పరిధిలో ఏటూరునాగారం, చర్ల, వెంకటాపురం పాయింట్ల ద్వారా 26 బస్సులను నడిపినట్లు ఆయన తెలిపారు. రూ. 7444937ఆదాయం వచ్చినట్లు తెలిపారు. భద్రాచలం డిపో పరిధిలో భద్రాచలం, పాల్వంచ పాయింట్ల ద్వారా 36 బస్సులు నడిపినట్లు తెలిపారు. రూ. 4691726 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కొత్తగూడెం డిపో పరిధిలో కొత్తగూడెం పాయింట్ నుంచి 90 బస్సులను నడిపినట్లు తెలిపారు. రూ. 10702941 ఆదాయం వచ్చిందని ఆర్ఎం తెలిపారు. మణుగూరు డిపో పరిధిలో మణుగూరు, మంగపేట పాయింట్ల నుంచి 21 బస్సు సర్వీసులను మేడారం జాతరకు నడిపినట్లు తెలిపారు. రూ.3933179 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలో 214 బస్సుల ద్వారా మేడారం జాతరకు 2040 ట్రిప్పులు నడిపినట్లు ఆర్ఎం తెలిపారు. వీటి ద్వారా రూ. 3,28,39,181 ఆదాయం వచ్చిందని తెలిపారు. మొత్తం 203863 మంది ప్రయాణికులు ఆర్టిసిలో బస్సులో జాతరకు వెళ్లినట్లు తెలిపారు. ఆక్యూఫెన్సీ రేటు 85 శాతం నమోదైందని తెలిపారు. జాతరకు ఆర్టిసి బస్సులను సద్వినియోగం చేసుకున్న భక్తులకు ఆర్ఎం ధన్యవాదాలు తెలిపారు. జాతర సందర్భంగా విధి నిర్వహణలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా కృషి చేసిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆర్ఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సత్తుపల్లి మున్సిపాలిటీపై కాంగ్రెస్ పట్టు బలపడుతోంది..



**23 వార్డుల్లో విజయానికి సిద్ధమైన హస్తం శ్రేణులు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా మరింత బలంగా ముందుకు సాగుతోందని తాజా పరిణామాలు స్పష్టంగా సూచిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను మంగళవారం అధికారికంగా ప్రకటించి, వారికి బిఫార్ములు అందజేయడం ద్వారా ఎన్నికల శంఖారావం పూరించారు సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం విశ్వాసం, కార్యకర్తల కృషి, ప్రజల మద్దతు కలిసివస్తే సత్తుపల్లి మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ ఖాతాలో వేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వార్డు స్థాయిలో బలమైన నాయకత్వాన్ని ఎంపిక చేశామని, ప్రతి అభ్యర్థి ప్రజల్లో నమ్మకం పొందిన వారేనని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకోసం అమలవుతున్న సంక్షేమ పథకాలు, పరిపాలనలో మార్పులు సత్తుపల్లి ప్రజల్లో సానుకూలతను పెంచాయన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల మార్గదర్శకత్వం కాంగ్రెస్‌కు అదనపు బలం చేకూరుస్తోందన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రచారం చేయాలన్నారు. వార్డు స్థాయిలో సమన్వయం కాంగ్రెస్ ప్రకటించిన 23 మంది అభ్యర్థులు మహిళలు, యువత, అనుభవజ్ఞులు కలగలిపిన సమతూకంతో ఉండటం విశేషం. ఇది పార్టీ సామాజిక సమీకరణకు నిదర్శనంగా మారింది. ప్రతి వార్డులో స్థానిక సమస్యలపై పట్టున్న నాయకులను ఎంపిక చేయడం వల్ల ప్రచారంలో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం లభించే అవకాశముందని భావిస్తున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల వాతావరణం ఏర్పడిందనడంలో ఎలాంటి సందేహం లేదు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న ఆశలు, స్థానిక ఎమ్మెల్యే చురుకైన పాత్ర, అభ్యర్థుల ఎంపికలో తీసుకున్న జాగ్రత్తలు ఇవన్నీ కలిస్తే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ప్రజల ఆశీస్సులతో, ప్రభుత్వ సంక్షేమ పథకాల దీవెనలతో సత్తుపల్లి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్న విశ్వాసం ఇప్పుడు పార్టీ శ్రేణుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

# నామినేషన్లు ఉపసంహరించుకున్న అభ్యర్థులు

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్, ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలకు సంబంధించిన నామినేషన్లు వేసిన అభ్యర్థుల్లో పలువురు మంగళవారం ఉపసంహరించుకున్నారు. కొత్తగూడెం కార్పోరేషన్ వ్యాప్తంగా 60 డివిజన్ల వ్యాప్తంగా మొత్తం 592 మంది నామినేషన్లు వేయగా, 234 ఉపసంహరించుకోవడంతో 358 మంది బరిలో ఉన్నారు. అశ్వారావుపేట మున్సిపాల్టీ పరిధిలోని 22 వార్డుల్లో 146 మంది నామినేషన్లు సమర్పించగా, 78 మంది పోటీ నుండి తప్పుకోవడంతో 68 మంది అభ్యర్థులు నిలిచారు. ఇల్లెందు మున్సిపాల్టీ 24 వార్డుల్లో 178 మంది నామినేషన్లు వేశారు. ఇందులో 71 మంది అభ్యర్థులు వారివారి నామినేషన్లను వెనక్కు తీసుకోవడంతో 107 మంది పోటీ చేస్తున్నారు.

# స్ట్రాంగ్ రూమ్ పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ జితేష్‌విపాటిల్ మంగళవారం పరిశీలించారు. నూతనంగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికలు సందర్భంగా వ్యవసాయ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూమ్ కటింగ్ హాల్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటు పాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు ఎన్నికల అబ్జర్వర్ అనిల్‌కుమార్, మున్సిపాలిటీ కమీషనర్ నాగరాజు, తహశీల్దార్, ఎంపిడిఓ తదితరులు ఉన్నారు.

# సిపిఐ అభ్యర్థి ముమ్మర ప్రచారం



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాలిటీగా అవతరించిన తర్వాత మొట్టమొదటిసారిగా జరగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో 19వ వార్డులో సిపిఐ పార్టీ అభ్యర్థి తిర్నాటి సంజయ్ సిపిఐ అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. అభ్యర్థి, సిపిఐ నాయకులు, కార్యకర్తలు 19వ వార్డులో గడపగడపుకు తిరుగుతూ ప్రజలను కలుస్తూ ప్రచారం కొనసాగించారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేది ఒక్క సిపిఐ పార్టీనేనని, సిపిఐ అభ్యర్థిని ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. 19వ వార్డులో ఎర్రజెండాను ఎగరవేస్తామని సిపిఐ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పిడిఎస్‌యు ఖమ్మం డివిజన్ కార్యదర్శి రాము తెలిపారు. మంగళవా రం పిడిఎస్‌యు ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి రాము మాట్లాడుతూ విద్యార్థులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతి స్కూల్‌ను సందర్శించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. సరైన పౌష్టికాహారం అందించకుండా ఒకే రకమైన భోజనాన్ని ఏజెన్సీలు అందిస్తున్నాయని దీనితో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా జిల్లా విద్యాశాఖాధికారులు పట్టించుకోకుండా కార్యాలయాలకే పరిమితమవుతున్నారన్నారు. పలువురు ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా హాజరు వేసుకుని వెళ్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు శ్రీకాంత్, విశ్వంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోర్టబుల్ ఎక్స్‌రేతో టీబీ నియంత్రణకు తొలి అడుగు

**జిల్లాలోనే తొలి టీబీ స్క్రీనింగ్ క్యాంప్**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** టీబీ వ్యాధి తీవ్రతను తగ్గిం చి, వ్యాప్తిని అడ్డుకునే లక్ష్యంతో తొలిసారిగా పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా టీబీ స్క్రీనింగ్ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు పిహెచ్ సి వైద్యులు డా.అన్వేష్ తెలిపారు. గతంలో శాంపిల్స్ తీసుకుని ఎక్స్‌రే కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయడం వల్ల చాలా మంది పరీక్షల కు హాజరుకాక వ్యాధి తీవ్రత పెరిగి, పక్కవారికి వ్యాప్తి చెందే ప్రమాదం ఉండేదని పేర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఇప్పుడు క్యాంప్‌లోనే ఎక్స్‌రే సౌకర్యం కల్పించడం ద్వారా వ్యాధిని త్వరగా గుర్తించి, వెంటనే మందులు అందించడంతో ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. మంగళవారం మండల పరిదిలోని బేతుపల్లి గ్రామంలో డిటిసిఓ డా. సుబ్బారావు పర్యవేక్షణలో, గంగారం పిహెచ్ సి డా. అన్వేష్ ఆధ్వర్యంలో జిల్లాలోనే తొలి టీబీ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో 60 మంది పెద్దలు, 20 మంది చిన్నపిల్లలకు ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు వైద్య లు తెలిపారు. పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులకు ప్రత్యేక పరీక్షలు చేపట్టారు. మండ లంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పోషకాహార లోపం ఉన్న చిన్నారులను క్యాంప్‌కు తీసుకువచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ రామారావు, ఏఎన్ఎం నాగమణి, హెల్త్ అసిస్టెంట్ విజయ్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, సిడిపిఓ మొహరున్నీసా బేగం, సూపర్‌వైజర్లు రజిని, మహలక్ష్మి, గంగాజలం, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి ,విజయమ్మ, మంగతాయారు, షకీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ పొత్తు ఖరారు

**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర మున్సిపాలిటీలో జరుగుతన్న ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్, సిపిఎం సిపిఐ పార్టీ మధ్య అధికారిక రాజకీయ పొత్తు ఖరారైంది. కాంగ్రెస్ పార్టీతో సిపిఐ మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో బిఆర్ఎస్ బలపర్చిన సిపిఐ అభ్యర్థి మడుపల్లి 7వ వార్డు నుండి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. మధిర మున్సిపాల్టీలో 22వ వార్డులకు గాను బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ అభ్యర్థుల వివరాలిలు ఇలా ఉన్నాయి. 1వ వార్డు దోర్నాల ఎలిజబేత్, 2వ వార్డు ధీరావత్ మాధవి, 3వ వార్డు లకుమాల వెంకటేశ్వర్లు, 4 మందడపు సుష్మిత, 5 ఏసుపోగు ఎస్తేరి, 6 నీలం అమల, 7 ఊట్ల కొండలరావు(సిపిఐ), 8 కొటారు రాఘవరావు, 9 మస్తేభక్తి కస్తూరిబాయి (సిపిఎం), 10 పెదూడి సుధాకర్, 11 గద్దల శారమ్మ, 12 గద్దల పాపారాణి, 13 మిరియాల సత్యావతి, 14 మారత అప్పారావు, 15 శ్రీపాద కోటేశ్వరి (సిపిఎం), 16 మల్లాది హన్మంతరరావు( టిడిపి రెబల్), 17 అంగడాల పార్వతీ, 18పంతంగి నాగయ్య(సిపిఎం) 19 యన్నంశెట్టి అప్పారావు, 20 రామాల కవిత, 21 పరిశ నాగలక్ష్మి , 22 రెడపంగి ప్రసాద్‌లు పోటీలో ఉన్నారు.

# బీ ఫారాలు సమర్పించిన సిపిఐ అభ్యర్థులు







**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచ డివిజన్ పరిధిలో కార్పోరేటర్‌లుగా పోటీ చేస్తున్న సిపిఐ, తెలుదేశం పార్టీ అభ్యర్థులు పార్టీ బి. ఫారాలు సమర్పించేందుకు చివరి రోజు మంగళవారం డివిజన్ కార్యాలయంలో సమర్పించారు. స్థానిక సిపిఐ కార్యాలయం నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో డివిజన్ కార్యాలయానికి చేరుకొన్నారు. రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం వెంట రాగా ఆయా డివిజన్‌లలో అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులకు తమ బి. ఫారాలను అందజేశారు. పాల్వంచ డివిజన్‌లో గల 27 డివిజన్‌లలో పోటీ చేస్తున్న అభ్యర్థులు అధికారులకు సమర్పించారు. కాగా విద్యార్థి దశ నుండి తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టి ప్రస్తుతం పట్టణ సహాయ కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యులుగాకొనసాగుతున్న ఉప్పుశెట్టి రాహుల్ 6వ, వార్డు నుండి, పట్టణ కార్యదర్శిగా బాద్యతలను మోస్తున్న అడుసుమిల్లి సాయిబాబలు 40వ, డివిజన్‌ల నుండి బరిలోకి దిగారు. వీసంశెట్టి విశ్వేశ్వరరావు 44వ, డివిజన్, సిపిఐ మద్దతుతో 45వ, డివిజన్‌లో తెలుగుదేశం అభ్యర్థి మొగులూరి క్రిష్ణ, ( శివరామ క్రిష్ణ ప్రసాద్ ) 39 వ, డివిజన్ నుండి అస్లాం, 35 నుండి నామా కీర్తి, 1, 2, 3, 4, 5, 7, 8, 9 నుండి వల్లపు లలిత కుమారి, పగిడిపల్లి ఆదిలక్ష్మి, గుగులోత్ కల్పన, రావుల స్వాతి, ఆలపాటి లీలావతి, బొంతు శారద, 31 నుండి 48 వరకు నునావత్ శ్యామల, ధరంసోత్ మోతీలాల్, వజ్జా రాజేశ్వరి, భట్టు విజయ, మడకం కమల, చెరుకూరి శేఖర్‌బాబు, గొర్ల అన్నపూర్ణ, గుత్తా వెంకట క్రిష్ణారావు, గోసనపల్లి వెంకటేష్, మహమ్మద్ జిలానీబేగం, గుర్రం వెంకటేశ్వర్లు, గుగులోత్ బాలు లు తమ బి. ఫారాలను అందజేశారు.

# 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/మణుగూరు:** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తిప్పికొట్టాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కార్మికులను కోరారు. మంగళవారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఆర్. మధుసూదన్ రెడ్డి (టియుసిఐ), వెలగపల్లి జాన్ (ఐఎన్‌టీయూసి), గడ్డం వెంకటేశ్వర్లు(ఏఐటియూసి), గద్దల శ్రీనివాస్ (సీఐటియూ) మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం కార్మికుల శ్రమను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కంకణం కట్టుకున్నదని దానిలో భాగంగానే ముందు తరాల కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చింది అన్నారు. వేతనాల కోడ్ ను 2019 లో, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020 సెప్టెంబర్ లో ప్రతిపక్ష పార్టీల ఎంపీలందరూ వీటిని వ్యతిరేకిస్తూ పార్లమెంటును బైకాట్ చేసిన సందర్భంలో, దేశం మొత్తం కరోనా కష్టకాలంలో ఉండగా పార్లమెంటులో ఆమోదింప చేసుకున్నారని అన్నారు. ఈ దేశ ప్రజల, కార్మికుల సంక్షేమం కంటే, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలే వీరికి ముఖ్యమన్నారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెల ఫలితంగా అమలుకు పూనుకోని కేంద్ర ప్రభుత్వం 2025 నవంబర్ లో నోటిఫై చేసి, 2026, ఏప్రిల్ నుండి అమలుకు సిద్ధమవుతుందన్నారు. ఈ లేబర్ కోడ్ లు అమలు అయితే కార్మిక హక్కులు కాల రాయబడతాయి అన్నారు. వీటిని తిప్పకొట్టవలసిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. లేకపోతే కార్పొరేట్ శక్తులకు కార్మిక వర్గం కట్టు బానిసలుగా తయారయ్యే ప్రమాదం ఉందన్నారు. ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తిప్పి కొట్టాలన్నారు. ఈ సమావేశంలో తోట. రమేష్, కొత్తపల్లి. సీతారాములు, బత్తుల. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్ద నుంచే యూరియాను బుక్ చేసుకోవచ్చు..





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రైతులు ఇంటి వద్ద నుంచేయూరియా ను బుక్ చేసుకోవచ్చునని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు యం.సతీష్ సూచించారు. మండలం లోని వివిధ గ్రామాలలో మంగళవారం మొక్కజోన్న, వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కత్తెర పురుగులో నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరి లో అగ్గి తెగులు నివారణ కు రైతులకు పలు సూచనలు చేశారు. పలు దుకాణాల ను తనీఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కూసుమంచి డివిజన్ లో 80 వేల ఎకరాలలో వరి. 16,800 ఎకరాలలో మొక్కజోన్న పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం వరిలో అగ్గి తెగులు, మొక్కజోన్న లో కత్తెర పురుగు పీడిస్తుందని అన్నారు. వాటి నివారణ కు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు యూరియా కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం యాఫ్ ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. యాఫ్ వలన జిల్లాలో ఎక్కడ యూరియా అందుబాటులో ఉన్న తీసుకోవచ్చునని అన్నారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే తప్పకుండా ప్రతీ రైతు ఫార్మర్ రిజిష్టర్ చేయించుకోవాలని అన్నారు. డివిజన్ వ్యాప్తంగా ఉన్న 57 సోసైటీల ద్వారా రైతులకు యూరియా ను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులునానో యూరియా, డీఏపీ వలన కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి మందుల రాధ, ఏఈవో డి.దాత్రి, వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ దండా నరసింహారావు పాల్గొన్నారు.

# ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మను కలిసిన దోసపాటి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ట్రైనీ కలెక్టర్ సౌబర్ శర్మను తహశీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా శివ కామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, జ్ఞాపికను అందించారు. ఈసందర్భంగా తహశీల్ధార్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

# కల్లూరులో కాంగ్రెస్, సిపిఐ పొత్తు



**ప్రజాపక్షం/కల్లూరు:** 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు సిపిఐ పార్టీకి పొత్తు కుదిరినట్లు డాక్టర్ దయానంద్ తెలిపారు. పొత్తులో భాగంగా సిపిఐ కి కోఆప్షన్ మెంబర్ ఇచ్చే హామీతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ తెలిపారు. పసుమర్తి చందర్రావు ఇంటివద్ద జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొంగులేటి ప్రసాదరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, 16వ వార్డు కౌన్సిల్ మెంబర్ అభ్యర్థి సిపిఐ పార్టీ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దామల రాజు గెలిపించాలని ఈ సమావేశంలో ప్రకటించారు.

# కేంద్ర జీఎస్‌ఈ అధికారులు తనిఖీలు...!

## ఐటీ, సీటీవో దాడులంటూ సోషల్ మీడియా లో వైరల్

## పలువురు వ్యాపారులు దుకాణాలు మూసివేత

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలో కేంద్ర జీఎస్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనీఖీలు నిర్వహించారు. మండల కేంద్రం కు చెందిన ఓ వ్యాపారి దుకాణంలో హైదరాబాద్ నుంచి వచ్చిన కేంద్ర ప్రత్యేక జీఎస్టి అధికారులు తనీఖీలు చేపట్టారు. సదరు వ్యాపారి కి నోటీసులు జారీ చేసి, తనీఖీలకు ప్రత్యేక బృందం తనీఖీలు చేపట్టారు. సదరు వ్యాపారి ఐరన్, సిమెంట్ వ్యాపారాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. క్రయ, విక్రయాలకు సంబంధించిన బిల్లులను తనీఖీ చేశారు. జీఎస్టి చెల్లింపుల ను పరిశీలించారు. రికార్డుల ప్రకారం స్టాక్ ఉందా లేదా అని గోడౌన్ వద్ద కు వెళ్లి తనీఖీ చేశారు. జీఎస్టి అధికారులు తనీఖీలు చేస్తున్న విషయం నుతెలుసుకున్న పలువురు వ్యాపారులు దుకాణాలను మూసివేశారు. ఇది ఇలా ఉండగా నేలకొండపల్లిలో వ్యాపారుల ఇళ్ల పై ఐటీ, సీటీవో ఇతర సంస్థల దాడులు అంటూసోషల్ మీడియాలో వైరల్‌చేశారు .దీంతో ఒక్కసారిగా వ్యాపారులు ఉలిక్కిపడ్డారు.

# ఇంటర్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు ఆదేశించారు. ప్రయోగ పరీక్షలు సజావుగా కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన మంగళవారం ములకలపల్లి, అశ్వారావుపేట మండలాల్లోని పలు జూనియర్ కాలేజీలను సందర్శించి ప్రయోగ పరీక్షలు జరుగుతున్న తీరును, ప్రయోగ శాలల ఏర్పాటు, విద్యార్థుల హాజరు నమోదు, ప్రశ్నాపత్రాల భద్రత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం అశ్వారావుపేట మండలంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలను తనిఖీ చేసి పరీక్షలు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా అనే దానిని స్వయంగా పరిశీలించారు. రెండో రోజు నిర్వహించిన ప్రయోగ పరీక్షలహాజరు వివరాలను సమీక్షించిన ఆయన ఉ. నిర్వహించి పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 1295మందిలో 32 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. వృత్తి విద్యావిభాగానికి కేటాయించిన 1386 మందిలో 179 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. అదే విధంగా మద్యాహ్నం నిర్వహించిన 880 మందిలో 19 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1365 మందిలో 58 మంది గైర్హాజరు అయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయోగ పరీక్షలు పూర్తయ్యే వరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ తప్పని సరిగా పాటించాలని కళాశాలల యాజమాన్యాలను ఆయన ఆదేశించారు.

# లండన్ ట్రినిటీ కాలేజీలో భద్రాద్రి శృతిలయ విద్యార్థుల ఘన విజయం




**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** శృతిలయ మ్యూజిక్ అకాడమీకి చెందిన 16న బ్యాచ్ విద్యార్థులు లండన్ ట్రినిటీ కాలేజీ నిర్వహించిన మ్యూజిక్ పరీక్షల్లో సత్తా చాటారు. ఈ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులతో పాటు 100 శాతం పాస్ మార్కులు సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా వారికి ఎస్పి రోహిత్ రాజ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ సంగీతం రావడం ఒక గొప్ప వరమని, సంగీతం వింటూ ఎంతటి ఒత్తిడినైనా తగ్గించుకోవచ్చని చెప్పారు. లండన్‌కు చెందిన ట్రినిటీ కాలేజీలో ఈప్రాంత విద్యార్థులు సంగీతంలో సత్తా చాటడం అభినందనీయమని, ఇందుకు కృషి చేస్తున్న శృతిలయ మ్యూజిక్ స్కూల్ చైర్మన్, డైరెక్టర్ కే ఏలియా కృషి ప్రశంసనీయం అన్నారు. ఈ సందర్భంగా ఏలియా మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ, జిల్లాగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరు లండన్ ట్రినిటీ కాలేజీలో చిరస్మరణీయంగా ఉండబోతోందని, ఇప్పటి వరకు 16బ్యాచ్‌ల విద్యార్థులతో సంగీత పరీక్షలు రాయించామని, రాసిన ప్రతీ విద్యార్థి చక్కటి ప్రతిభ కనబరుస్తూ మెరిట్ సాధిస్తున్నారన్నారు. విద్యార్థులు ఎంతో శ్రద్ధతో మ్యూజిక్ నేర్చుకోవడం వల్లే ఇంతటి విజయాలు శృతిలయ మ్యూజిక్ స్కూల్‌కు సొంతం అవుతున్నాయని, త్వరలో మరిన్ని విజయాలు సాధించి జిల్లా నుండి చక్కటి మ్యూజిక్ ఆల్‌బమ్ తీసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# కార్యాలయాల్లో మహిళల భద్రత అత్యవసరం



**ప్రజాపక్షం/పాల్వంచ :** పని ప్రదేశాలు, కార్యాలయాలలో మహళల భద్రత, గౌరవం, సమానత్వం కల్పించటం అత్యవసరమని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ కొత్తగూడెం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. ఝాన్సీ రాణి అన్నారు. లక్ష్మీదేవిపల్లిలో గల పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి. పద్మ అధ్యక్షతన ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ జే. మాధ్వి ఆధ్వర్యంలో కార్యస్థలాల్లో మహిళల భద్రత అంశంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఝారన్సీరాణి మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులను నివారించే చట్టాలు, కార్యాలయాలలో అనుసరించాల్సిన భద్రతా ప్రమాణాలు, అంతర్గ ఫిర్యాదు కమిటి విధి విధానాలు, ఫిర్యాదు చేసే విధానాలపై అవగాహన కల్పించారు. మహిళలు నిర్భయంగా పని చేయగల సురక్షిత వాతావరణం ఏర్పాటు చేస్తే వారి సామర్థ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. మహిళల భద్రతకు యాజమాన్యం, ఉద్యోగులు బాద్యత వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలోఅద్యాపకులు ఎన్. శ్రీదేవి, పర్వీన్, విమల, తేజస్విని, లీల, డి. రమేష్, పారెల్లి శ్రీనివాస్, పవన్, వెంకటక్రిష్ణ, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

